

సాక్షి
నిర్మల్
ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023



గోండుపాలనలో ఇనుపధాతువు
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రాచీనకాలంలో ఇనుపధాతువులను మొదటిసారిగా గోండు రాజులే గుర్తించారు. మేలిమి ఇనుముతో ఆయుధాలు తయారు చేయించారు. 8లో▸



వామ్మో.. పులులు
ఆదిలాబాద్ జిల్లాలోని పెన్‌గంగ పరివాహక ప్రాంత గ్రామాలకు మళ్లీ పులి భయం పట్టుకుంది. గురువారం అర్ధరాత్రి భీంపూర్ మండలం గొల్లఘాట్ సమీపంలో నాలుగు పులులు స్థానికుల కంటపడ్డాయి. 10లో▸

గరిష్టం/కనిష్టం
36.0 / 18.0

వాతావరణం
వాతావరణం ఎండగా ఉంటుంది. చలి ప్రభావం తగ్గుతుంది. పగలు వేడి, ఉక్కపోతగా ఉంటుంది. తెల్లవారుజామున చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కంటివెలుగును వినియోగించుకోవాలి



పరీక్షలు చేయించుకుంటున్న అజేశ్‌కుమార్

నిర్మల్‌టౌన్: కంటివెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కోర్టు ప్రాంగణంలో శనివారం కంటివెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కోర్టు సిబ్బంది ఒకేచోట కంటి పరీక్షలు చేయించుకోవడానికి మంచి అవకాశం దొరికిందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ధనరాజ్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ సేవలపై అవగాహన ఉండాలి
ప్రతి ఒక్కరూ చట్టాలు, న్యాయసేవలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో విద్యార్థులకు న్యాయ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సైబర్ చట్టాలు, యాసిడ్ దాడులు, బాల్య వివాహాలు, గృహహింస చట్టం తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికల చట్టాలను ఎలా వినియోగించుకోవాలో ఈ సందర్భంగా వివరించారు. న్యాయవాదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిక్కులకు పునరావాసం



సిక్కులతో మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ సమీపంలో చాలా ఏళ్లుగా నివాసముంటున్న సిక్కు కుటుంబాలకు శనివారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి, రిటైర్డ్ ఐపీఎస్ తేజ్‌దీప్‌కౌర్ నాగునాయిపేటలో పునరావాసం కల్పించారు. ఈ సందర్భంగా 35 కుటుంబాలకు కుట్టుమిషన్లు, గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. వీరికి ప్రత్యేకంగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించారు.

నేడు సైనిక్‌స్కూల్ ప్రవేశ పరీక్ష

సారంగపూర్: జామ్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో ఆదివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రుక్మాపూర్ సైనిక్‌స్కూల్ ఆరోతరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రమా కళ్యాణి ఓ ప్రకటనలో తెలిపారు. 361 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

గురుద్వారాలో ప్రత్యేకపూజలు



ప్రవచనాలు చేస్తున్న పంజాబ్ గురువులు

ముధోల్: శ్రీసంత్ శిరోమణి సద్గురు రవిదాస్ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని మోచి కుల సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన మండల కేంద్రంలోని గురుద్వారా సాహెబ్‌లో పవిత్ర గురుగ్రంథ సాహెబ్‌జీని శనివారం ప్రతిష్ఠించారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో గురుద్వారా లంగర్ సాహెబ్ నుంచి ప్రత్యేక పల్లకిలో భజనలు, కీర్తనల మధ్య గురుగ్రంథ సాహెబ్‌జీని సంత్ బాబా నరేంద్రసింగ్ చీఫ్ మేనేజర్ గురుద్వారా లంగర్, సంత్‌బాబా బల్విందర్‌సింగ్, చీఫ్ గురుద్వారా లంగర్ శ్రీహుజుర్‌సాహెబ్ నాందేడ్ ప్రత్యేక సహకారంతో ఇక్కడకు తీసుకువచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

28న బాసర ఆలయ హుండీ లెక్కింపు

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ హుండీని ఈ నెల 28న ఉదయం 9గంటలకు లెక్కించనున్నట్లు ఈవో విజయరామారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం వివరాలు ప్రకటిస్తామని పేర్కొన్నారు.

నిర్మల్ మున్సిపల్ కమిషనర్ సంపత్ బదిలీ

నిర్మల్: నిర్మల్ మున్సిపల్ కమిషనర్ అరిగెల సంపత్ సిద్దిపేటకు బదిలీ అయ్యారు. నిర్మల్ కమిషనర్‌గా సీవీఎన్ రాజు నియమితులయ్యారు. శనివారం రాత్రి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సీవీఎన్ రాజు గతంలో నిర్మల్‌లో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆదిలాబాద్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న ఆయన నిర్మల్‌కు కమిషనర్‌గా వస్తున్నారు. గతేడాది మే 19న వచ్చిన సంపత్ స్వల్ప కాలంలోనే బదిలీ అయ్యారు.

రెండేళ్లు.. రెండు లక్షల పరీక్షలు!



టీ హబ్ లో పరీక్షలు నిర్వహిస్తున్న ఇబ్బంది

- డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఉచితంగా రోగ నిర్ధారణ టెస్టులు
- 24 గంటల్లోనే రిపోర్టులు
- నిరుపేద వర్గాల్లో హర్షాతిరేకాలు

జిల్లాలో రెండేళ్లలో చేసిన పరీక్షలు

రోగుల సంఖ్య	81,219
నమూనాలు	1,62,059
పరీక్షలు	2,78,970
పారామీటర్స్	17,06,220

నిర్మల్ చైన్‌గేట్: ప్రజలకు రోగ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నోస్టిక్ కేంద్రం పేదప్రజలకు ఎంతో ఉపయోగపడుతోంది. నిర్మల్‌లోని టీహబ్‌లో రికార్డు స్థాయిలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. అత్యంత ఖరీదైన పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహిస్తూ 24 గంటల్లోపే రిపోర్టులు ఇస్తున్నారు. ఆన్‌లైన్‌లో సంబంధిత పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల డాక్టర్లతోపాటు రోగి ఆన్‌డ్రాయిడ్ ఫోన్‌కు ఫలితాల రిపోర్టులు పంపిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 81,219 రోగుల నుంచి రక్త నమూనాలు సేకరించి వారికి అవసరమైన 2,78,970 వైద్య పరీక్షలు నిర్వహించి రిపోర్టులు పంపించారు. రోజుకు సగటున 800 నుంచి 900 రక్తనమూనాలు పరీక్షిస్తున్నారు.

రెండు లక్షలకుపైగా టెస్టులు..
జిల్లా ఆస్పత్రిలో 2021 ఫిబ్రవరి 21న తెలంగాణ డయాగ్నోస్టిక్స్ హబ్ ప్రారంభించారు. జిల్లాలోని 18 పీహెచ్‌సీలు, మూడు అర్బన్ పీహెచ్‌సీలు, జిల్లా ప్రసూతి ఆసుపత్రి, భైంసా ఏరియా ఆస్పత్రులకు వైద్యం కోసం వచ్చిన రోగులకు అవసరమైన రోగ నిర్ధారణ పరీక్షలు ఈ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో నిర్వహిస్తున్నారు. ఇందుకోసం రక్త నమూనాలు సేకరించి నిత్యం కేంద్రానికి పంపిస్తున్నారు. పరీక్షల రిపోర్టును 24 గంటల్లో ఆన్‌లైన్‌లో ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల డాక్టర్లకు పంపుతున్నారు. పరీక్ష ఫలితాల ఆధారంగా రోగులకు వైద్యం అందిస్తున్నారు.

57 రకాల వైద్య పరీక్షలు ఫ్రీ
ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక్కో రోగికి అవసరమైన రెండు మూడు శాంపిళ్లు సేకరించి పరీక్షల కోసం పంపుతున్నారు. ఇందులో ఖరీదైన సీబీపీ (కంప్లీట్ బ్లడ్ పిక్చర్), థైరాయిడ్ ప్రొఫైల్, లివర్ ఫంక్షన్ టెస్ట్, డయాబెటిక్ ప్రొఫైల్, లిపిడ్ ప్రొఫైల్, పాథాలజీ టెస్టు, మైక్రోబయాలజీ టెస్టు ఇలా 57 రకాల పరీక్షలు చేస్తున్నారు. డయాగ్నోస్టిక్ కేంద్రంలో ఉచితంగా రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంతో రోగులకు చాలావరకు ఆర్థిక భారం తప్పింది. గతంలో అన్ని పరీక్షలు ప్రైవేట్ ల్యాబ్‌లోనే చేయించుకోవాల్సి వచ్చేది. చికిత్సకంటే.. రోగ నిర్ధారణ పరీక్షలకే ఎక్కువ డబ్బులు వెచ్చించాల్సి వచ్చేది.

మరుసటిరోజే రిపోర్టు

రోగ నిర్ధారణ పరీక్షల రిపోర్టులు గతంలో పీడీఎఫ్ రూపంలో రోగుల స్మార్ట్ ఫోన్లకు పంపించేవారు. స్మార్ట్ ఫోన్ లేనివారు రిపోర్టు చూసుకోవడానికి ఇబ్బంది పడేవాళ్లు. అలాంటి వారి కోసం ప్రత్యేకంగా రిపోర్టు కాపీలను అందించేందుకు ఏర్పాట్లు చేయడంతో రోగుల ఇబ్బందులు తీరాయి. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన విధానంతో నేరుగా బాధితులకు నిర్ధారణ ఫలితాల నివేదికలు అందుతున్నాయి. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లకు వైద్య ఆరోగ్య శాఖ ఇటీవలే కంప్యూటర్లు, ప్రింటర్లను సరఫరా చేసింది. దీంతో స్మార్ట్ ఫోన్ లేకున్నా మరుసటిరోజు పీహెచ్‌సీకి వెళ్తే రిపోర్టు ప్రింట్ తీసి ఇస్తున్నారు.

రోగులకు ఉపయోగకరం



ఉచిత రోగ నిర్ధారణ పరీక్షలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. 57 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో నిర్వహిస్తున్నారు. దీంతో రోగులకు ప్రైవేట్‌గా పరీక్షలు చేసుకునే భారం తప్పింది. నిత్యం రక్త నమూనాలకు పరీక్షలు నిర్వహించి 24 గంటల్లో రిపోర్టులు ఇస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ లేనివారు 24 గంటల తర్వాత సంబంధిత పీహెచ్‌సీకి వెళ్లి రిపోర్టు ప్రింట్ తీసుకోవచ్చు.
– ధనరాజ్, డీఎంహెచ్‌వో

వినియోగించుకుంటున్నారు



జిల్లాలో రోగనిర్ధారణ పరీక్షలు ప్రజలకు ఉపయోగకరంగా మారాయి. ఈ అవకాశాన్ని చాలామంది సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్తే ప్రజలకు వేల రూపాయలు ఖర్చు తప్పదు. ఖరీదైన పరీక్షలు కూడా టీల్యాబ్‌లో ఉచితంగా నిర్వహిస్తున్నాం. రోగ నిర్ధారణతో వ్యాధికి చికిత్స అందించడం సులభమవుతుంది.
– మధుసూదన్‌రెడ్డి, క్వాలిటీ మేనేజర్

ఆస్పత్రిలోనే 'ఆధార్'..!

- పుట్టిన శిశువు వివరాలు నమోదు
- ఫొటో, పేరెంట్స్ బయోమెట్రిక్ సేకరణ
- వెంటనే ఆధార్‌కార్డు అందజేత
- పేరు పెట్టిన తర్వాత నవీకరణ
- జిల్లాలో కొనసాగుతున్న ప్రక్రియ



జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో ఆధార్ నమోదు చేస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రస్తుతం దేశంలో ప్రతి ఒక్కరికీ ఆధార్ నంబర్ తప్పనిసరైంది. దీంతో అందరూ తమ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అయితే చిన్నపిల్లల విషయంలో ఆధార్ నమోదుపై చాలామంది తల్లిదండ్రులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. బడికెళ్లే వయస్సు వచ్చే దాకా వివరాలు నమోదు చేయించడంలేదు. కొందరికి అవగాహన లేక పిల్లలకు ఆధార్‌కార్డు తీసుకోవడం లేదు. దీంతో ప్రభుత్వం చైల్డ్ ఎన్‌రోల్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చింది. ఇందులో భాగంగా అప్పుడే జన్మించిన శిశువులకు వెంటనే ఆధార్‌కార్డు అందించేలా చర్యలు చేపట్టింది.

గత నెల నుంచే అమలు
ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్న సర్కారు.. జన్మించిన శిశువుకు వెంటనే ఆధార్‌కార్డు అందించే సౌకర్యం కల్పిస్తోంది. కేసీఆర్ కిట్‌తోపాటు ఆడ, మగపిల్లలు పుడితే ప్రోత్సాహకాలు అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గత నెల నుంచి జిల్లా ప్రసూతి ఆస్పత్రితోపాటు భైంసా ఏరియా ఆసుపత్రిలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. నెల వ్యవధిలో జిల్లా ప్రసూతి ఆసుపత్రిలో 105, భైంసా ఏరియా ఆసుపత్రిలో 30 మంది శిశువుల ఆధార్ నమోదు జరిగింది. ప్రస్తుతం వీరికి బర్త్ సర్టిఫికెట్ అవసరం లేకుండానే ఆధార్ కార్డు వచ్చేస్తోంది. అదే ప్రైవేట్ ఆస్పత్రిలో జన్మించిన పిల్లలకు మాత్రం బర్త్ సర్టిఫికెట్ ఉంటేనే ఆధార్ నమోదవుతుంది.

ఫొటో, తల్లిదండ్రుల బయోమెట్రిక్‌తో..
శిశువు జన్మించిన తర్వాత ఆసుపత్రిలోనే తల్లిదండ్రుల వివరాలు బయోమెట్రిక్ ద్వారా నమోదు చేస్తున్నారు. కేసీఆర్ కిట్ల పంపిణీ ప్రక్రియ బాధ్యతలు నిర్వర్తించే డాటా ఎంట్రీ ఆపరేటర్లకే ఆధార్ నమోదుపై శిక్షణ ఇచ్చారు. బయోమెట్రిక్ పరికరం, ట్యాబ్‌తో పాటు అవసరమైన పరికరాలు అందజేశారు. అప్పుడే జన్మించిన శిశువు ఫొటోతో పాటు తల్లిదండ్రులు బయోమెట్రిక్ తీసుకుని వివరాలు నమోదు చేసి నంబర్ ఇస్తారు. దీని ద్వారా ఎక్కడైనా ఆధార్ ధ్రువీకరణపత్రాన్ని ప్రింట్ తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం తల్లి పేరుతో 'బేబీ ఆఫ్ మదర్' అని నమోదు చేస్తారు. శిశువుకు పేరు పెట్టిన తర్వాత అదే నంబర్‌తో ఆధార్‌ను నవీకరించుకునే అవకాశాన్ని కల్పించారు.

ఆధార్ నమోదు చేస్తున్నాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు అప్పుడే జన్మించిన శిశువుకు ఆధార్ నమోదు చేస్తున్నాం. ఇప్పటికే కేసీఆర్ కిట్ పంపిణీ చేసే సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. వారితోనే ఆధార్ నమోదు చేయిస్తున్నాం. శిశువు ఫొటో, తల్లిదండ్రుల బయోమెట్రిక్ వివరాలతో ఆధార్ నంబర్ ఇస్తున్నాం. మొదట్లో కొన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రస్తుతం వేగంగా ప్రతీ శిశువుకు ఆధార్ ఇస్తున్నాం.
– దేవేందర్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్, నిర్మల్

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: విద్యుత్ ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీని వెంటనే అమలు చేయాలని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ జేఆర్ చౌహాన్ కోరారు. విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీ ఏడాది గడుస్తున్న నిర్లక్ష్యం వహిస్తున్న యాజమాన్య ధోరణికి నిరసనగా శనివారం జిల్లా కేంద్రంలోని సర్కిల్ కార్యాలయం ప్రాంగణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చౌహాన్ మాట్లాడుతూ.. ఇకనైనా యాజమాన్యం స్పందించి పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మెర శ్రీనివాస్‌రావు, ఏ పోచయ్య, ఎం.రామకృష్ణ, టీ మచ్చేందర్, ఎంకే మధుకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

'పాత పేరునే కొనసాగించాలి'

నిర్మల్‌చైన్‌గేట్: లక్ష్మణచాంద మండలం బాబాపూర్ ఎక్స్ రోడ్ పేరును అలాగే కొనసాగించాలని కోరుతూ బాబాపూర్ వీడీసీ సభ్యులు శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల రోడ్డు వెడల్పులో భాగంగా మామడ రేంజ్ పరిధిలో గల చెక్‌పోస్టును బాబాపూర్‌లో ఏర్పాటు చేశారని తెలిపారు. నర్సాపూర్ గ్రామస్తులు బాబాపూర్ ఎక్స్ రోడ్ పేరును తొలగించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. వందల ఏళ్లుగా కొనసాగుతున్న పేరును అలాగే కొనసాగించాలని కోరారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందించినవారిలో బాబాపూర్ సర్పంచ్ శ్రీవిద్య, మాజీ సర్పంచ్ తునికి నారాయణ, మాజీ ఎంపీపీ రాజేశ్వర్ గ్రామభివద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'

ఖానాపూర్: ప్రజాసమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ఆరోపించారు. శనివారం రాత్రి మండలంలోని పాత ఎల్లాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద జరిగిన స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌కు హాజరై మాట్లాడారు. పాలకుల వైఫల్యం కారణంగా ఊరూరా ప్రజలు అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలంతా కమీషన్లు వస్తేనే పనులు చేయని పరిస్థితి ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు అజ్మీరా హరినాయక్, పడాల రాజశేఖర్, టేకు ప్రకాశ్, దాసరి రాజేశ్వర్, ఎత్తడి పుల్లయ్య, మహేశ్, శేఖర్ తదితరులున్నారు.

ప్రజలను వంచిస్తున్న కేసీఆర్
కడెం: సీఎం కేసీఆర్ మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ఆరోపించారు. మండలంలోని నర్సాపూర్, పెద్దూర్, కొండుకూర్ గ్రామల్లో నిర్వహించిన కార్నర్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భవిష్యత్‌లో డబుల్ ఇంజిన్ సర్కారు రావడం ఖాయమని ధీమా వ్యక్తంజేశారు. నాయకులు కిష్టయ్య, రమణారెడ్డి, రవీందర్‌రెడ్డి, మోహన్‌నాయక్, రవిగౌడ్ తదితరులున్నారు.

నేడు మున్సిపల్ సమస్యలపై 'సాక్షి ఫోన్ ఇన్'

సమయం : ఉదయం 11నుంచి 12గంటల వరకు



రత్నాకర్‌రావు, మున్సిపల్ కమిషనర్, ఖానాపూర్

ఖానాపూర్: ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ చిక్యాల రత్నాకర్‌రావుతో ఆదివారం సాక్షి 'ఫోన్ ఇన్' నిర్వహించనుంది. పట్టణంలోని వీధి కుక్కలు, కోతుల బెడద, వెలగని వీధి దీపాలు, పారిశుధ్య లోపం, తాగునీటి సరఫరాలో అంతరాయం తదితర సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు మున్సిపల్ కమిషనర్ సమస్యలు తెలిపి పరిష్కరించుకోవచ్చు. మున్సిపల్ కమిషనర్‌ను 9440040793 నంబర్‌లో సంప్రదించాలి.

సమస్యలు త్వరగా పరిష్కరిస్తాం

- మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్
- 'సాక్షి ఫోన్ ఇన్'కు విశేష స్పందన
- సమస్యలు తెలిపిన నిర్మల్ ప్రజలు



ఫోన్‌లో సమస్యలు వింటున్న సంపత్‌కుమార్

నిర్మల్‌టౌన్: పట్టణంలో నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని నిర్మల్ మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. వీధి కుక్కలు, కోతులు, పందుల బెడద నివారణ, పారిశుధ్యం నిర్వహణ, తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు తదితర సమస్యలపై శనివారం ఉదయం 11నుంచి 12 గంటల వరకు 'సాక్షి' ఆధ్వర్యంలో 'ఫోన్ ఇన్' నిర్వహించగా పట్టణ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆయా వార్డుల ప్రజలు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఫోన్ ద్వారా కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. కమిషనర్ వాటిని నమోదు చేసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు.

ప్రశ్న: డ్రైనేజీ లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి వస్తోంది. కాలనీవాసులమంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.
– శ్రీనివాస్, గొల్లపేట్, బీసీ కాలనీ, 10వ వార్డు

కమిషనర్: కాలనీలో పర్యటించి మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు చేపడతాం. కాలనీలో డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తాం.

ప్రశ్న: చుట్టుపక్కల గల ఖాళీ ప్లాట్లలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో దోమల బెడద ఎక్కువైంది. పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారు.
– జోగు చంద్రశేఖర్, శాస్త్రీనగర్, 13వ వార్డు

కమిషనర్: మున్సిపల్, శానిటరీ సిబ్బందిని పంపి ఖాళీ ప్లాట్లలో గల పిచ్చి మొక్కలు తొలగిస్తాం. కాలనీలో శానిటేషన్ చేయించి దోమలు లేకుండా చర్యలు చేపడతాం.

ప్రశ్న: వీధి కుక్కలు, పందులు, కోతుల సమస్యలతో వేగలేక పోతున్నాం.
– శంకర్, సునర్‌గల్లీ, 41వ వార్డు

కమిషనర్: ఉన్నతాధికారులతో చర్చించి వాటిని సంరక్షణ కేంద్రాలకు పంపించే ఏర్పాట్లు చేస్తాం.

ప్రశ్న: సరైన నీటి సదుపాయం లేదు. మున్సిపల్ నల్లా నీళ్లు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.
– శ్రావణ్‌కుమార్, బేస్తర్‌పేట్, 25వ వార్డు

కమిషనర్: స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి బోరు వేయించి నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

ప్రశ్న: కాలనీలో రోడ్లన్నీ గుంతలు పడ్డాయి. ఈ కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సీసీ రోడ్లు నిర్మించాలి.
– అభిలాష్, సాగర్‌కాలనీ, 20వ వార్డు

కమిషనర్: సీసీ రోడ్ల నిర్మాణ విషయం సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం.

ప్రశ్న: కుక్కల బెడదతో చిన్నపిల్లలు బయట ఆడుకోవాలంటేనే భయపడుతున్నారు.
– సిద్దిక్ అలీ, పాతమార్కెట్, 39వ వార్డు

కమిషనర్: గతంలోనూ ఈ సమస్య ఉండగా పరిష్కరించాం. మళ్లీ సమస్య ఉంది. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తాం.

ప్రశ్న: ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఉదయం ఖాళీ మద్యం సీసాలు, చెత్తాచెదారం ఉంటోంది. ఉదయం పూట వాకింగ్ చేయడానికి ఇబ్బందులేర్పడుతున్నాయి.
– అడప నవీన్, వాకర్, బాగులవాడ

కమిషనర్: మున్సిపల్ సిబ్బందితో ప్రతిరోజూ స్టేడియాన్ని శుభ్రం చేయిస్తాం. పోలీసులకు సమాచారం ఇచ్చి స్టేడియంలో ఎవరూ మద్యం సేవించకుండా చూస్తాం.

ప్రత్యేక తరగతులపై నిర్లక్ష్యం వద్దు

- జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి
- పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు



నర్సాపూర్(జీ): విద్యార్థినులకు సూచనలు చేస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

సారంగపూర్: పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంలో నిర్లక్ష్యం చేయవద్దని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని చించోలి(బీ), ధని, జామ్, సారంగాపూర్ ఉన్నత పాఠశాలలు, జామ్ గ్రామంలోని కొండాపూర్ కేజీబీవీ, జామ్ కేజీబీవీ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదోతరగతి విద్యార్థుల ప్రీఫైనల్ పరీక్షలను పర్యవేక్షించారు. జామ్ ఉన్నత పాఠశాలలో 31మందిలో 8మంది హాజరు కాకపోవడం, ఉదయం ప్రత్యేక తరగతులు నిర్వహించకపోవడం, గణిత ఉపాధ్యాయురాలు గైర్హాజర్ కావడంపై ఆగ్రహం వ్యక్తంజేశారు. గైర్హాజరైన ఉపాధ్యాయురాలి ఒక్కరోజు వేతనం కట్ చేయాలని హెచ్‌ఎంను ఆదేశించారు. జామ్ హైస్కూల్ విద్యార్థులకు ఇంతవరకు స్టడీమెటీరియల్ అందించకపోవడంపై మండిపడ్డారు. వెంటనే స్టడీమెటీరియల్ అందించాలని ఆదేశించారు. అనంతరం అక్కడే జరుగుతున్న 'మన ఊరు మనబడి' పనులను పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి
నర్సాపూర్(జీ): ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించారు. విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి సందేహాలు నివృత్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. సెక్టోరియల్ అధికారి రవిగౌడ్, ఎస్వో సునీత, ఉపాధ్యాయులున్నారు.

కుంటాల: 'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలే చర్యలు చేపట్టాలని డీఈవోరవీందర్‌రెడ్డి సూచించారు. కుంటాల ఉన్నత పాఠశాల, ఓలా ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. హాజరుశాతం, విద్యార్థుల ప్రగతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తంజేశారు. సెక్టోరల్ ఆఫీసర్ రవి, హెచ్‌ఎంలు నర్సయ్య, సునీల్‌రెడ్డి, తాజ్ బీమీరాజ్, సర్పంచ్ కనీస్‌ఫాతిమా, ఎస్ ఎంసీ వైస్ చైర్మన్ యూనుస్ తదితరులున్నారు.

'అర్హుల ఎంపికకే వార్డుసభలు'



తొమ్మిదోవార్డులో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ రాంబాబు

భైంసాటౌన్: డబుల్‌బెడ్రూం ఇళ్ల కేటాయింపులో అర్హులను ఎంపిక చేసేందుకే వార్డుసభలు నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ రాంబాబు పేర్కొన్నారు. శనివారం భైంసాలో నిర్వహించిన వార్డుసభలను పరిశీలించారు. 26 వార్డుల్లో వార్డు అధికారులు అర్హుల తాత్కాలిక జాబితా ప్రదర్శించి అభ్యంతరాలు స్వీకరించారు. ఉదయం 10.30 గంటలకు వార్డుసభలు ప్రారంభం కావాల్సి ఉండగా, జాబితా అందడంలో జాప్యమేర్పడింది. దీంతో ఆర్డీవో రవికుమార్ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి జాబితా పంపించాలని సిబ్బందికి సూచించారు. మధ్యాహ్నం 12నుంచి ఒంటిగంట ప్రాంతంలో వార్డులవారీగా జాబితాలు చేరగా ప్రదర్శించి అభ్యంతరాలు స్వీకరించారు. అదనపు కలెక్టర్ రాంబాబు ఏపీనగర్, పులేనగర్, భట్టిగల్లి వార్డుసభలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అభ్యంతరాలు పరిశీలించి తుదిజాబితా త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఆరు అభ్యంతరాలు.. 779 దరఖాస్తులు
భైంసా అర్బన్ పరిధిలో 660 డబుల్ బెడ్రూం ఇళ్లకు గతంలో అధికారులు దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. 6,811 దరఖాస్తులు రాగా, రెండు విడతల్లో అధికారులు సర్వే చేసి 1,115 మంది అర్హులంటూ తాత్కాలిక జాబితా రూపొందించారు. వార్డుసభల్లో అభ్యంతరాలు స్వీకరించి ఆరుగురు అనర్హులని తేల్చారు. మరో 779 మంది తాము అర్హులమంటూ దరఖాస్తు చేసుకున్నట్లు ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

రిమ్స్‌లో ట్యూటర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న 16 ట్యూటర్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయనున్నట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. మార్చి 2న ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనాటమి డిపార్ట్‌మెంట్‌లో నాలుగు, ఫిజియాలజీలో నాలుగు, బయోకెమెస్ట్రీలో రెండు, ఫార్మాకాలజీలో నాలుగు, ఫోరెన్సిక్ మెడిసిన్‌లో రెండు పోస్టులకు నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 45 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులని, నెలకు రూ.57,700 చెల్లించడం జరుగుతుందన్నారు. మూడేళ్ల పాటు కొనసాగిస్తామని, ఇతర వివరాలకు adilabad.telangana.gov.in వెబ్‌సైట్ సంప్రదించాలని కోరారు.

ఇసుకలారీ పట్టివేత



టింబర్ డిపోలోని పట్టుకున్న ఇసుకలారీ

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి శివారులోని అటవీ ప్రాంతం సమీపం నుంచి ఇసుక తరలిస్తున్న లారీని శనివారం రాత్రి అటవీ అధికారులు పట్టుకున్నారు. ఎఫ్‌ఆర్‌వో వినాయక్ వివరాల ప్రకారం.. ఇసుక తవ్వి తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాన్ని పక్కా సమాచారం మేరకు అటవీశాఖ సిబ్బంది వెళ్లి పట్టుకున్నారు. లారీ యజమాని ఏలేటి వరుణ్‌రెడ్డితో పాటు డ్రైవర్ ఎండీ రహీంలపై కేసు నమోదు చేశారు. లారీని ఖానాపూర్ అటవీ రేంజ్ పరిధిలోని టింబర్ డిపోకు తరలించారు.

మిస్సింగ్ కేసు నమోదు

కుభీర్: మండలంలోని జుమ్డా గ్రామానికి చెందిన ఠాకూర్ తులసిరాం (60) మూడు రోజులుగా కనిపించడం లేదు. దీంతో శనివారం కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శవయ్య తెలిపారు.

వీధికుక్కల దాడిలో లేగదూడ మృతి

భైంసా: బాసర మండల కేంద్రంలో వీధికుక్కలు దాడిలో లేగదూడ మృతి చెందింది. గ్రామానికి చెందిన కొట్టే సాయిలుకు చెందిన పశువుల పాకలో లేగదూడపై శుక్రవారం అర్ధరాత్రి వీధికుక్కలు దాడి చేశాయి. దీంతో లేగదూడ మృతిచెందింది. అధికారులు శనివారం చేరుకుని పరిశీలించారు.

గోండుపాలనలో ఇనుపధాతువు

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అపారమైన ఇనుప ఖనిజం
- ఇనుముతో ఆయుధాల తయారీ..
- శత్రుదుర్భేద్యంగా కోటల నిర్మాణాలు
- సిర్పూర్ కేంద్రంగా కొనసాగిన పాలన
- కాకతీయులకు తీసిపోకుండా రాతి కట్టడాలు
- 881ఏళ్ల పాటు గోండుల పాలన



బాదన్‌కుర్తి వద్ద గోండు రాజులు నిర్మించిన కోట

సండే స్పెషల్

ఇచ్చోడ: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రాచీనకాలంలో ఇనుప ధాతువులను మొదటిసారిగా గోండురాజులే గుర్తించారు. గోండురాజుల కాలంలో మేలిమి ఇనుము ఉన్న ప్రాంతాల్లో ఇనుపధాతువును వెలికితీసి ఆయుధాలను తయారు చేయించారు. తమ రాజ్యాలపై యుద్ధాలకు వచ్చిన శత్రు సైన్యాలను ఎదురొడ్డి తమ రాజ్యాలను కాపాడుకున్న చరిత్ర ఆదిలాబాద్ జిల్లా గోండురాజులకే దక్కింది. రాతితో నిర్మించిన కోటలు వారి పాలనకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఎంతో ఘనచరిత్ర ఉన్న గోండు రాజులు సిర్పూర్ కేంద్రంగా 870 నుంచి 1751 వరకు దాదాపుగా 881 ఏళ్లపాటు పాలన కొనసాగించారు. ఇంతటి ప్రసిద్ధి చెందిన గోండురాజ్యం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సిర్పూర్ కేంద్రంగా ఏర్పడడం జిల్లా ప్రాముఖ్యత తెలుస్తుంది.

ఇనుమును గుర్తించింది గోండురాజులే..



ఖానాపూర్ మండలంలోని పాతతర్లపాడులోని ఇనుప ఖనిజాలను పరిశీలిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ కట్కం మురళి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా విస్తరంగా ఉన్న ఇనుమును మొదటిసారిగా గోండు రాజులే గుర్తించారు. ఖానాపూర్ సమీపంలో ఎలగడప, పెంబి సమీపంలోని రాగిదుబ్బ, భైంసా సమీపంలోని సిరాల, లక్ష్మణచాంద మండలంలోని పారపెల్లి, కుర్రులలో ఇనుప ధాతువును గుర్తించిన గోండురాజులు ఆ ప్రదేశాల్లో ఇనుప పరిశ్రమలను ఏర్పాటు చేయించారు. ఇనుముతో తయారైన కత్తులు యుద్ధాలలో వాడేవారని, కోటాలు, బురుజులను నిర్మించినట్లు ఆధారాలు లభించినట్లు కొత్త తెలంగాణ చరిత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ కట్కం మురళి వివరించారు.

సిర్పూర్ కేంద్రంగా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్ కేంద్రంగా గోండుల పాలన కొనసాగింది. సిర్పూర్ కేంద్రంగా 19 మంది వరకు గోండు రాజులు పాలన సాగించారు. మొట్టమొదటగా సిర్పూర్ కేంద్రంగా ఏర్పడిన గోండు రాజ్యానికి భీంబల్లల్ సింగ్ మొదటి రాజు (870–895) 25ఏళ్ల పాటు తన పాలన కొనసాగించారు. జిల్లాలో తాండురు, ఉట్నూర్‌లో గోండు రాజులు నిర్మించిన రాతి కట్టడాలు ఇప్పటికి చెక్కు చెదరకుండా ఉన్నాయి. సిర్పూర్ అసలు పేరు సూర్యపురం కాలక్రమేనా సిర్పూర్‌గా మారింది.

ఉట్నూర్ కేంద్రంగా....

దేవగిరి కేంద్రంగా పరిపాలించిన యాదవరాజ్యానికి, ఓరుగల్లు కేంద్రంగా పరిపాలించిన కాకతీయ రాజ్యానికి ఉట్నూర్ సరిహద్దు ప్రాంతంగా ఉండేది. ఉట్నూర్ కేంద్రంగా 13వ శతాబ్దాంలో గోండుల పాలన కొనసాగింది. ఆత్రం తెగకు చెందిన వంశీయులు ఉట్నూర్ కేంద్రంగా పరిపాలన కొనసాగించారు.

కనకాయి కేంద్రంగా...

మధ్యయుగంలో బీర్షా అనే గోండు రాజు బోస్రా వాగు వంపుల్లో మూడు వైపుల నీటి రక్షణగా ఉన్న ప్రదేశంలో కోటాను నిర్మించి రాజ్యాన్ని స్థాపించాడు. తనకున్న కుమార్తెల పేర్లపై నాలుగు గ్రామాలను నిర్మించాడు. అవి అర్కాయి, భూతాయి, గిర్జాయి,కనకాయి. కొడుకులు లేక చిన్న కూమార్తె కనకాయి పేరు మీదనే కోటను నిర్మించాడు. మూడు వైపుల నీటి రక్షణగా ఉన్న కోటకు నాల్గో వైపు రక్షణ కోసం ఆరు ఎకరాల విస్తీర్ణంలో నీటి గుంటను తవ్వి బొస్రా వాగు నీటితో నింపి రక్షణ ఏర్పాటు చేశాడు. ఈ కోట విస్తీర్ణం 53.9ఎక రా లు. ప్రస్తుతం ఈ ప్రాంతం బజార్‌హత్నూ ర్‌లోని కనకాయి జలపాతంగా ప్రాచుర్యంలో ఉంది.

1751 తర్వాత క్షీణించిన గోండురాజ్యం...

మధ్యయుగం, ఆధునిక యుగంలో వెలుగొందిన గోండు రాజ్యం 1751 అనంతరం క్షీణించింది. 16వ శతాబ్దంలో ఏర్పడిన బహమని రాజ్యం, తరువాత గోల్కొండను పరిపాలించిన కుతుబ్‌షాహిలు, అహ్మద్‌నగర్‌ను పరిపాలించిన నిజాం షాహిలు, భీజపూర్‌ను పరిపాలించిన ఆదిల్‌షాహిలు, బీదర్‌ను పరిపాలించిన బరీద్ షాహిలు, బీరార్‌ను పరిపాలించిన ఇమాద్ షాహిలు గోండులపై నిరంతరంగా దాడులు చేశారు. 1724లో ఆధికారంలోకి వచ్చిన అసబ్ జాహి (నిజాం) కాలంలో గోండులు మరింత క్షీణించారు. 1857– 58 సిపాయిల తిరుగుబాటు కాలంలో రోహిల్లలతో పాటు రాంజీగోండు నాయకత్వంలోని గోండులను మొత్తం వెయ్యి మందిని నిర్మల్‌లోని వెయ్యి ఊడలమర్రికి నిజాం ప్రభుత్వం ఉరితీయించింది. దీంతో గోండులు బయపడి పూర్తిగా అడవి ప్రాంతాలకు వెళ్లిపోయారు.

రాతి కట్టడాలే గోండుల పాలనకు సజీవ సాక్ష్యాలు




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూర్, తాండూర్, కనకాయి ప్రాంతాల్లోని రాతికట్టడాలు గోండు రాజుల పాలనకు సజీవ సాక్ష్యాలుగా నిలిచాయి. మధ్య భారతదేశంలో ప్రసిద్ధి చెందిన రాజ్యాల్లో గోండురాజ్యం ప్రధానమైంది. గోండుల మూలపురుషుడు కొల్ బిల్లా. ఇతడి పాలనలో ఆయుధ సంపత్తి కోసం ఇనుప ఖనిజాన్ని వెలికితీయించి ఆయుధాలు తయారు చేయించాడు. ఇతడి సాయంతో ఏర్పడిన గోండు రాజ్యానికి మొదటిరాజు భీంబల్లల్ సింగ్. మహారాష్ట్రలోని బల్లార్షాకు తన రాజధానిని మార్చాడు. భీంబల్లాల్ సింగ్ పేరుతోనే బల్లార్షా అనే పేరు వచ్చింది.

– కట్కం మురళి, అసిస్టెంట్ ప్రొఫెసర్



ఉట్నూర్‌లో గోండురాజులు నిర్మించిన కోట



తాండూర్ కోట

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. డిపో పరిధిలోని ప్రయాణికులు వివిధ సమస్యలను డీఎం దృష్టికి తీసుకురాగా ఆమె వాటిని నమోదు చేసుకొని వాటి పరిష్కారానికి కషి చేస్తానని పేర్కొన్నారు. బేల నుండి హరీష్ రెడ్డి మాట్లడుతూ సైద్‌పూర్ నుంచి బేల వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా, రోడ్ సర్వే నిర్వహించి త్వరలో బస్సు ప్రారంభిస్తామని డీఎం తెలిపారు. నిర్మల్ నుంచి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఉట్నూర్ నుంచి నిర్మల్‌కి బస్సు సౌకర్యం కల్పించామని అడుగగా ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. తర్నం నుంచి అశ్విని మాట్లాడుతూ బేల సర్వీసులను వయా తర్నం నుంచి ఎప్పుడు నడిపిస్తారని అడగగా తర్నం బ్రిడ్జ్ రిపేర్ ఉందని, బేల సర్వీసులను వాయా లాండసాంగ్వి నుంచి నడుపుతున్నామని, బ్రిడ్జి రిపేర్ అయిన తర్వాత వయా తర్నం నుంచి బస్సులు పునరుద్ధరిస్తామని సమాధానం ఇచ్చారు.

నేడు సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

- ఉమ్మడి జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



బెల్లంపల్లి పరీక్ష కేంద్రంలో హాల్ టిక్కెట్ నంబర్లు సరిచూస్తున్న సీఓఈ ప్రిన్సిపాల్ సైదులు

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల సైనిక్‌స్కూల్‌లో ప్రవేశం కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష జరగనుంది. ఇందుకు సంబంధించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్ సీఓఈ బాలికల కళాశాల, బెల్లంపల్లి బాలుర సీఓఈ కళాశాల, నిర్మల్(జామ్) బాలికల గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రవేశ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగనుంది. నిర్దేశించిన పరీక్ష కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కో– ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి ప్రకటించారు. ఆరో తరగతిలో ఉమ్మడి జిల్లాలో 618మంది, ఇంటర్మీడియెట్‌లో 590మంది విద్యార్థులు పరీక్ష రాయడానికి పోటీపడుతున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు సంబంధించిన విద్యార్థుల కోసం ఆదిలాబాద్ సంక్షేమ గురుకుల బాలికల సీఓఈ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, నిర్మల్ జిల్లా విద్యార్థులకు జామ్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో, మంచిర్యాల జిల్లా విద్యార్థుల కోసం బెల్లంపల్లిలోని సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ కళాశాలలో పరీక్ష కేంద్రాన్నీ నిర్వహించనున్నారు.

ఆరో తరగతి.. ఇంటర్‌లో ప్రవేశం

గురుకుల సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశం ఉంటుంది. ఆరో తరగతిలో 80, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో 80 సీట్ల చొప్పున సైనిక్ స్కూల్‌లో అడ్మిషన్ కల్పిస్తారు. ఇందుకు విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుంది. ప్రవేశ పరీక్షలో మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు సైనిక్ స్కూల్‌లో ప్రవేశం కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల సైనిక్ స్కూల్ కరీంనగర్ (రుక్మాపూర్)లో మాత్రమే ఉంది. ఇందులో బాలురకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. ఒకేఒక గురుకుల సైనిక్ స్కూల్ మాత్రమే ఉండడంతో ప్రవేశానికి విద్యార్థుల మధ్య పోటీ తీవ్రంగా ఉండనుంది. బెల్లంపల్లి, ఆదిలాబాద్, జామ్ పరీక్ష కేంద్రాలలో చీఫ్ సూపరింటెండెంట్‌గా ఐనాల సైదులు, సంగనబట్ల శ్రీనివాస్, కె.రమాకళ్యాణి వ్యవహరించనున్నారు. పరీక్ష కేంద్రాల విషయంలో ఏమైన సందేహాలు ఉంటే విద్యార్థికి సంబంధించిన హాల్ టిక్కెట్‌లో ఇచ్చిన పరీక్ష కేంద్రం మొబైల్ నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవాలని కోఆర్డినేటర్ స్వరూపారాణి తెలిపారు.

ప్రవేశ పరీక్ష రాయనున్న విద్యార్థుల వివరాలు

పరీక్ష కేంద్రం	ఆరో తరగతి	ఇంటర్మీడియెట్
ఆదిలాబాద్ సీఓఈ బాలికల కళాశాల	200	199
బెల్లంపల్లి సీఓఈ బాలుర కళాశాల	201	247
నిర్మల్ (జామ్) బాలికల పాఠశాల/కళాశాల	217	144

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య



జాదవ్ సంజీవ్(ఫైల్)

భైంసారూరల్: మండలంలోని వాటోలి గ్రామానికి చెందిన జాదవ్ సంజీవ్ (45) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జాదవ్ సంజీవ్ హైదరాబాద్‌లో ప్రింటింగ్‌ప్రెస్ నిర్వహిస్తుండగా కరోనా కారణంగా ఆర్థికంగా కోలుకోలేదు. కొన్నిరోజులుగా వాటోలిలోనే ఉంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య జాదవ్ సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వెల్లడించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



బోర్లకుంట రమేశ్(ఫైల్)

కడెం: అప్పుల బాధతో ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని కొండుకూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పాత కొండుకూర్‌కు చెందిన బోర్లకుంట రమేశ్(45) ఈ నెల 24న రాత్రి గ్రామ సమీపంలో పంట పొలాల వద్ద పురుగుల మందుతాగాడు. శనివారం ఉదయం గమనించిన అతడి మామ పెద్ద రాజన్న పోలీసులకు సమాచారం ఇచ్చాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం ఆదిలాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. టుటౌన్ ఎస్సై ఊశన్న వివరాల ప్రకారం... పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన చౌహాన్ సంజన్ (53) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం ఆదిలాబాద్ నుంచి జైనథ్ మండలం కౌటసాంగ్వి వైపు ట్రాక్టర్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు పట్టణంలోని గణేశ్ మందిర్ సమీపంలోని కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలి శవం స్వాధీనం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ ఎస్సై విష్ణు ప్రకాష్ తెలిపారు. శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో రైల్వేస్టేషన్ ఎదుట మృతిచెంది ఉండడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

భైంసాటౌన్: బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని గోపాల్‌నగర్‌కు చెందిన విశాల్, గంగాధర్, మనోహర్ శనివారం సాయంత్రం భైంసా వైపు వస్తుండగా భోకర్ చౌరస్తా సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. స్థానికులు వారిని 108లో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. విశాల్, గంగాధర్‌లను నిజామాబాద్‌కు తరలించారు.

క్రీడా పాఠశాలలతో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు

ఉట్నూర్: ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన విద్యార్థులకు గిరిజన క్రీడాశ్రమ పాఠశాలల ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు దిలిప్‌కుమార్ అన్నారు. శనివారం ఉట్నూర్ డివిజన్ స్థాయి క్రీడాశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఎంపిక కోసం నిర్వహించిన క్రీడా పోటీల్లో ఆయన పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. జిల్లాలో నాలుగేళ్ల క్రితం క్రీడాశ్రమ పాఠశాలలు ప్రారంభమయ్యాయని, నాటి నుంచి వివిధ స్థాయిలలో నిర్వహిస్తున్న క్రీడల ద్వారా గిరిజన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని వివరించారు. ఈ విద్య సంవత్సరంలో వివిధ సందర్భాల్లో నిర్వహించిన జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల ద్వారా గిరిజన విద్యార్థులు 160 పథకాలు సాధించడం గర్వకారణమన్నారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదిగేలా క్రీడ పాఠశాలల్లో తీర్చిదిద్దుతామన్నారు. ఈ నెల 28న భోథ్ డివిజన్ స్థాయి పోటీలు జాతర్లలో, వచ్చే నెల 1వ తేదీన ఆదిలాబాద్ డివిజన్ స్థాయి పోటీలు జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడలాధికారి పార్థ సారథి, ఏటీడీవో క్రాంతి, క్రీడ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, పీడీలు, కోచ్‌లు ఉత్తం, హేమంత్, శ్రీనివాస్, రవీందర్, సునంధ్, జయవంత్, శేఖర్, జలపతి, స్వప్న, శివ ఉన్నారు.

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు యువకులు మృతి



రాజు మృతదేహం



దత్తాహరి (ఫైల్)

కుభీర్: మండలంలో వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు యువకులు శనివారం మృతిచెందారు. పోలీసుల వివరాల ప్రకారం కుభీర్‌కు చెందిన పోతన్న అనే రైతు చేనులో శుక్రవారం రాత్రి బోరు వేస్తున్న క్రమంలో ఆ బండిపై పనిచేసే ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన అక్క రాజు (31) ఖాళీ సమయంలో బోరుబండిపై పడుకున్నాడు. ఆపరేటర్ మరిచి బోరుబండిని ఆపరేట్ చేయగా రాడ్ తలకు తగిలింది. అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లగా శనివారం మధ్యాహ్నం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై యశ్వంత్ తెలిపాడు.

వాగులో పడి..

మండలంలోని గొడ్సర గ్రామానికి చెందిన మానేవార్ దత్తాహరి (30) శనివారం మధ్యాహ్నం వాగులోపడి మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం... మృతుడి తల్లి, భార్య, చెల్లితో కలిసి తన చేనులో పనులు చేస్తున్నాడు. మధ్యాహ్నం సమయంలో వాగువైపు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు గాలించగా వాగులో శవమై కనిపించాడు. సీఐ చంద్రశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గిరిజన గురుకుల విద్యార్థులకు షార్ట్ ఫిలింలో శిక్షణ



పాఠశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఇచ్చోడ: తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు షార్ట్ ఫిల్మ్ మేకింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పుణేలో ట్రెనింగ్ చేసిన కుమారి లావణ్య నాలుగు రోజుల నుంచి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈశిక్షణలో యాక్టింగ్, డైరెక్షన్, కెమెరా, ఎడిటింగ్‌తో పాటు సంగీతంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల 27 వరకు ఈ శిక్షణ కొనసాగనుందని వివరించారు.